సామెతకథలు

# అగస్త్యభ్రాత

- శ్రీ ముసునూరి లక్ష్మీగణపతిశాస్త్రి.

ఇతడు ప్రసిద్ధుడైన అగస్త్యమహర్షియొక్క సోదరుడు. తల్లి గర్భమందే పరిపూర్ణ జ్ఞానం కలిగిన ఈతడు, లౌకిక వ్యవహారంలో ఎంతమాత్రం ప్రసిద్ధుడు కాలేదు.

విరాగియైన యీతడు అరణ్యమందే ఒక్క ఆకుటిల్లు ఆశ్రమంగా కల్పించుకొని అందే కాలం గడపివైచాడు. అరణ్యవాసం చేస్తూండే రామలక్ష్మణు లీతని యాశ్రమం ప్రవేశించి యీ మహాత్ముని దర్శనం చేసికొన్నారు. అయినప్పటికీ లౌకికంగా ఈతడుగాని, ఈతని ఉనికిగాని అప్రసిద్ధం కావడంచేత ఈతణ్ణి అగస్త్యభ్రాత అని పిలువవలసి వచ్చింది. సామాన్యంగా ప్రజలు ఈ న్యాయాన్నే పురస్కరించుకొని పేరు ప్రతిష్ఠలు గడించుకోని వాణ్ణి, తమ పెద్దల పేరుపెట్టుకొని కాలక్షేపం చేస్తూండేవాణ్ణి, ఊరూ-పేరూ లేనివాణ్ణి అగస్త్యభ్రాత అని పిలుస్తుంటారు.

*ఎవ్వరైనా మిమ్ములను అగస్త్యభ్రాత అన్నారంటే, అగస్త్యునితో పోల్చి, అతని తమ్మునిగా స్తుతిస్తున్నారని అనుకుంటే పొరపాటు. వారు మిమ్ములను వ్యంగ్యముగా అలా సంభోదిస్తున్నారన్న మాట! తస్మాత్ జాగ్రత్త!*

*(గత సంచికలో ప్రచురించిన 'రామాయణముతో ముడిపడ్డ సామెతలు/జాతీయములు' పట్టీలో ఇది ఒక జాతీయము.)*

# అగస్త్యమూత్రం

మరీచి యనువాడు వైశ్వానర పుత్రికయగు కాలకయందు కాలకేయులను గనెను. కాలక బ్రహ్మను గూర్చి తపము గావించి, తన పుత్రులు ఎన్నడును ఓడిపోకుండునట్లు వరము గైకొనెను. అట్టి వరబలమున కాలకేయులు మునులను సదా బాధించుచుండిరి. మునులు కోరగా పెక్కుమార్లు వేల్పుటేడు వారిపై దాడిచేసెను. వారు పగలంతయు సముద్రమున దాగియుండి, రాత్రులు యుద్ధమునకు తలపడువారు. ఈవిధంగా వారిని దేవతలు కూడా ఏమీ చేయజాలకపోయిరి.

అప్పుడు దేవతలు మునులు కలిసి అగస్త్యుని ప్రార్ధించిరి. అతడు వారిపై కరుణించి సముద్ర జలములను కేశవ, నారాయణ, మాధవయని ఆపోశనము చేసివైచెను. అందు దాగియున్న కాలకేయులు బైటపడిరి. అప్పుడు దేవతలు వారిపై దాడిచేసి పోరున మడియించిరి. పిదప మునులు సముద్రమును తిరిగి జలమయము చేయుడని అగస్త్యుని వేడుకొనిరి. అతడు సముద్రజలములను తన కుక్షిలో జీర్ణించుకొనియున్నందున అధోముఖముగా విడిచిపెట్టెను. అటుపై గంగాజలములు అందు కలిసినందున సముద్రుడు పూర్వమువలె నిండుతనము వహించెను. అగస్త్యునిచే విడువబడిన సముద్రమునకు అగస్త్యమూత్రమను పేరు వాడుకలోనికి వచ్చినది. *